
సాక్షి ఒడిశా
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,53,608లు, బంగారం 750 మిల్లీగ్రాములు, వెండి 2.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఆకట్టుకున్న వేషధారణలు

- 8లో



వైభవం.. వార్షిక బ్రహ్మోత్సవం

- 8లో

న్యూస్‌రీల్

సంధ్యా హారతిపై వీడియో షూటింగ్



షూటింగ్ ముహూర్తపు పూజలు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారికి నిత్యం హారతి ఇస్తుంటారు. ఇందులో భాగంగా సాయంత్రం ఇచ్చే హారతి ప్రత్యేకం. దీనిపై స్థానిక కళాకారులు వీడియోను రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించి పితామహాల్‌లోని చంద్రకళా ఫార్మ్‌హౌస్‌లో ముహూర్తపు షాట్ చిత్రీకరణకు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయం మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ పాఢి ఈ హారతిపై గీతాన్ని రచించారు. ఆయనతో పాటు ప్రముఖ హిందీ సినీ నేపథ్యగాయని అనురాధ పౌడ్వాల్ దీనిని ఆలపించారు. గీతాన్ని దృశ్య రూపంలో భక్తులకు అందించేందుకు షూటింగ్‌కు శ్రీకారం చుట్టామని పాఢి తెలిపారు. సంగీతం బీకే మహంతి అందించగా, బీఫిల్మ్ నిర్మాణ సంస్థ చిత్రీకరిస్తోంది.

కాలవైశాఖీ ప్రభావిత ప్రాంతాల్లో చైర్మన్ పర్యటన



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న చైర్మన్ రంజన్‌శెఠి

కొరాపుట్: కాలవైశాఖీ ప్రభావిత ప్రాంతాల్లో కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటేందు రంజన్ శెఠి ఆదివారం పర్యటించారు. జిల్లా కేంద్రంలోని 18వ వార్డు శాంతినగర్‌లో బాధితులను పరామర్శించారు. శనివారం రాత్రి కాలవైశాఖి ప్రభావంతో ఈదురు గాలులతో పాటు భారీ వర్షం పడింది. దీంతో పట్టణంలో 5 ఇళ్లు కూలిపోగా, 8 ప్రాంతాల్లో చెట్లు నేలకూలి నష్టం ఏర్పడింది. దీంతో నష్టం అంచనా వేయాలని తహసీల్దార్‌కు సూచించారు. పురపాలక సంఘం తరుపున బాధితులకు ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. యుద్ధ ప్రాతిపదికన చెట్లు తొలగించారు. విద్యుత్ లైన్ల పునరుద్ధరించారు.

మే నెలాఖరుకు ప్లస్2 ఫలితాలు

- విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్‌దాస్



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత, మాధ్యమిక విద్యా మండలి(సీహెచ్ఎస్ఈ) ఆధ్వర్యంలో జరిగిన ప్లస్2 వార్షిక పరీక్షల ఫలితాలు మే నెలాఖరులోగా వెల్లడించనున్నారు. ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయని రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యావిభాగం మంత్రి సమీర్ రంజన్‌దాస్ ఆదివారం తెలిపారు. వార్షిక పరీక్షల జవాబు పత్రాలు దిద్దే తొలి దశ మూల్యాంకన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆయన ప్రకటించారు. ఈనెల 23తో ఈ ప్రక్రియ ముగించడంతో పాటు మే 7నుంచి రెండో విడత మూల్యాంకనం పూర్తి చేస్తామన్నారు. ఈ దశ ముగియడంతో టేబులేషన్ చేపడతారని పేర్కొన్నారు. ఇలా దశల వారీగా జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియను ముగించి, మే నెలాఖరులోగా ఫలితాలు వెల్లడించేందుకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. జవాబు పత్రాలు దిద్దేందుకు 65 ఆఫ్‌లైన్ కేంద్రాలు, 39 ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దోషరహిత మూల్యాంకనం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశామని వివరించారు. గతంలో అలజడి రేపిన 662మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ అభ్యర్థన మేరకు పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియలో పూర్తిస్థాయిలో సహకరించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తంచేశారు.

సందడి.. సంబరం

- ఉత్సాహంగా కొనసాగుతున్న పొనా సంక్రాంతి సంబరాలు
- పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు, మహిళలు
- విజేతలకు ఈనెల 14, 15 తేదీల్లో బహుమతులు



చిత్రలేఖనం పోటీలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు



ముగ్గు వేస్తున్న యువతి



రాయగడ: పొనా సంక్రాంతి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. స్థానిక గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14, 15తేదీల్లో జరగనున్న సంబరాల్లో భాగంగా గత గత 2రోజులుగా నిర్వాహకులు వివిధ పోటీలను ఏర్పాటు చేశారు. కృష్ణచంద్ర నగర్ భవన్ ప్రాంగణంలో ఆదివారం మహిళల మధ్య ముగ్గుల పోటీలు నిర్వహించగా, 33మంది పాల్గొన్నారు. ఇందులో రింకి బెహరా ప్రథమ బహుమతి సాధించగా, సునీత సామంతరాయ్ ద్వితీయ, లోపముద్ర రథొ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఝరనా పాణి, ప్రవీనా మిశ్రా లకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. న్యాయనిర్ణేతలుగా పద్మినీ మిశ్రా, కాలిచరణ్ రథొ, ప్రణతి పాత్రొ వ్యవహరించారు.

చిత్రలేఖనం పోటీలు..

వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా.. జూనియర్ విభాగంలో నిషాంత్ దాస్ ప్రథమ బహుమతి, అనీఫా పిడిసిక ద్వితీయ, దివ్యాంశు సాహు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సాయిప్రియ రౌత్, సిద్వేస్ పురోహిత్‌కు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. సీనియర్ విభాగంలో వాల్మీకి జొడియా ప్రథమ, సాక్షి సిమ్రాన్ ద్వితీయ, ఆయుషి దొర తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పి.లోక్షిత, ఢిల్లేశ్వరి సాహు లకు ప్రోత్సాహక బహుమతులు దక్కాయి. పోటీలకు హెచ్ఎస్ పాండియా, రుబిరాణి కుండు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



అందమైన రంగవల్లులు అద్దుతున్న మహిళలు

గ్రూప్ డ్యాన్ విభాగంలో..

ఉత్సవాల్లో భాగంగా జరిగిన గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో స్థానిక సేవాసమాజ్‌కు చెందిన బృందం ప్రథమ బహుమతి గెలుచుకోగా.. డీఎఫ్‌ఓ బస్తీలైన్ బృందం ద్వితీయ, జీసీడీ సమీపంలోని సేవాసమాజ్ బృందం తృతీయ బహుమతి గెలుచుకున్నారు. పోటీలకు త్రిలోచన్ సాహు, పింకి రథొ, గోపి మహాపాత్రొ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 14, 15 తేదీల్లో జరిగే సంబరాల వేదిక వద్ద బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.



గ్రూప్ డ్యాన్స్ విభాగంలో చిన్నారుల నృత్యాలు



నిర్వాహకులతో డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న బృందాలు

పూరీ జిల్లాలో క్రీస్తుపూర్వం నాటి సామగ్రి

- చెరువు తవ్వకాల్లో నాబ్డ్ వైర్, మట్టిపాము పడగ, రాతి పాత్ర అవశేషాలు లభ్యం



హంతుసర గ్రామం చెరువు తవ్వకాల్లో బయటపడిన పురాతన అవశేషాలు

భువనేశ్వర్: పూరీ జిల్లాలో ప్రాచీన సామగ్రి బయటపడింది. గోప్ మండలం హంతుసర గ్రామంలో చెరువు తవ్వకాల్లో వీటిని గుర్తించారు. ఈ పురాతన వస్తువు యొక్క అవశేషాలు క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దపు అద్భుతమైన విదేశీ నావికా వర్తక వాణిజ్య కథనంలో విశ్లేషణ ఉన్నట్లు పురావస్తు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇటీవల హంతుసార గ్రామం చరిత్ర అధ్యాపకుడు భాస్కర్ ముదులి స్థలంలో చెరువు తవ్వుతుండగా పురావస్తు సామగ్రిగా గుర్తించారు. స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం ప్రాచీన భారతీయ చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాఖ సహాయ ప్రొఫెసర్ డాక్టర్ అనమ్‌చరణ్ బెహెరా ఈ స్థలాన్ని, వస్తువులను పరిశీలించారు. రాష్ట్ర చరిత్రలోని అనేక రహస్య అంశాలను వెలికి తీసేందుకు ఈ పురావస్తు వస్తువులు సహాయపడతాయని పేర్కొన్నారు. చెరువు తవ్వకంలో.. నాబ్డ్ వైర్, మట్టిపాము పడగ, రాతి పాత్ర అవశేషాలు, మట్టి సీసాముూత, చదరంగం బోర్డు, చదరంగం పావులు, కొన్ని పురాతన శకలాలు, వివిధ రకాల పాత్రలు కనుగొనబడ్డాయి. డాక్టర్ బెహెరా మాట్లాడుతూ గోప్ మండలం హంతుసర గ్రామం పాథొరొబుహొ కాలువకు ఎడమ వైపు ఉంది. ఈ కాలువ మీదుగా రాళ్ల రవాణా దాఖలాలు ఉన్నట్లు చరిత్రకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కోణార్క్ ఆలయ నిర్మాణం రాళ్లు ఈ మార్గంలో రవాణా అయిన రాళ్లను వినియోగించినట్లు ఈ వర్గం తెలిపింది. ఈ కాలువ మీదుగా చాలాదూరం నుంచి పడవల్లో వీటిని రవాణా చేసేవారు. హంతుసారా గ్రామంలో లభించిన పురావస్తు వస్తువులు, పాథొరొబుహొ కాలువ జానపద కథలు ఒడిశా చరిత్రలో విశిష్టమైన విదేశీ వాణిజ్య చరిత్రను తెలియజేస్తున్నాయని వివరించారు.

ఒడిశా కవులకు సత్కారం



బొమ్మాలి నాగభూషనాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

రాయగడ: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు శ్రీశ్రీ కళావేదిక, చంద్రాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి నగరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్కడి మహతి ఆడిటోరియంలో 48గంటలు నిర్విరామంగా జరగనున్న ఈ ఉత్సవాలను కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ప్రారంభించారు. సంస్థ కన్వీనర్ కె.రమావతి, ఇంద్రాని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఇంద్రకుమార్ రాజు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు తమ స్వీయ కవితలు చదివి వినిపించారు. ఏకపాత్రాభినయనం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాయగడ జిల్లా గుణుపూర్‌కు చెందిన కవి బొమ్మాలి నాగభూషణాన్ని నిర్వాహకులు సత్కరించారు. పర్లాకిమిడి నుంచి చైతన్య సమితి కార్యవర్గ సభ్యులు ముండూరు శేఖరరావు, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సభ్యులు ఎర్ర లక్ష్మణరావు పాల్గొని, తమ కార్టున్ లను ప్రదర్శనలో ఉంచారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



రైలు పట్టాలపై ఈశ్వరరావు మృతదేహం

రాయగడ: రైలు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన స్థానిక మజ్జిగౌరి మందిరానికి సమీపంలోని రైల్వే వంతెనపై చోటు చేసుకుంది. మృతుడు జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి గ్రామానికి చెందిన ఈశ్వరరావు(35)గా పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈశ్వరరావు ఆదివారం ఉదయం మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చా డు. దర్శనం అనంతరం సమీపంలోని రైల్వే వంతెన పైకి వెళ్లాడు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వస్తున్న గూడ్స్ రైలు అతనిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



గాయపడిన వ్యక్తి

జయపురం: జయపురం–ఉమ్మరి మధ్య 26వ జాతీయ రహదారిపై రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జయపురం సదర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జయపురం లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశారు. మరణించిన, గాయపడిన వ్యక్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలి

- విక్రమదేవ్ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే తారాప్రసాద్



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



వార్షికోత్సవంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు

జయపురం: విద్యార్థులను ఉత్తమ భావాలతో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆకాంక్షించారు. పట్టణంలోని విక్రమదేవ్ స్వయంపాలిత కళాశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.. అనంతరం మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి దేశ రథ సారథులని పేర్కొన్నారు. క్రమశిక్షణతో మెలిగి ఏకాగ్రత, ధృడ మనోభావంతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. అటువంటి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమైనదని తెలిపారు. రాష్ట్రంలో పురాతన విక్రమదేవ్ కళాశాలను విస్తరించడంతో పాటు అభివృద్ధి చేసేందుకు 100 ఎకరాల స్థలం, రూ.250 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లేఖ రాశానని గుర్తుచేశారు. సీఎం నవీన్ పట్నాయక్ ఆమోదంతో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకోవడం తోపాటు పట్టణానికి సమీపంలో 75ఎకరాల స్థలం కేటాయిండంపై హర్షం వ్యక్తంచేశారు. త్వరితగతిన అధికారులు స్థలాన్ని పరిశీలించి, యూనివర్సిటీ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత రీడర్ డాక్టర్ సీలాద్రినాథ్ రథ్, జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి ప్రసంగించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ హల్దార్ అధ్యక్షత వహించారు. ఉత్సవంలో విద్యార్థులు పలు నృత్య, నాట్యాలతో ఆహుతులను ఉర్రూతలూగించారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

ప్రశాంతంగా చాంబర్ డైరెక్టర్ల ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న 749మంది సభ్యులు



ఓటు వేస్తున్న చాంబర్ సభ్యుడు



క్యూలైన్లో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న అభ్యర్థుల మద్దతుదారులు



ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ప్రతినిధులు

జయపురం: రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వాణిజ్య, వ్యాపార, పరిశ్రమ యజమానుల సంఘం జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ల పదవులకు ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలకు ఉదయం నుంచే ఓటర్లు, అభ్యర్థులు మద్దతుదారులు చేరుకున్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య క్రమ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఇందులో మొత్తం 876మంది సభ్యులు ఉండగా, 749మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. 21 డైరెక్టర్ల పదవులకు 40మంది పోటీలో ఉన్నారు. అభ్యర్థులు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు కొంతమంది ప్రదర్శనలు, వాగ్దానాలు చేసినట్లు సమాచారం. ఎన్నిక రోజు కూడా అభ్యర్థులు ఓటర్లను కలిసి, తమకు ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది. 21మంది అభ్యర్థుల ఫొటోతో ఉన్న బ్యాలెట్ పేపరులో ప్రతి ఓటరు తమకు నచ్చిన 21మందికి ఓటు వేశారు. పోలింగ్ అధికారులుగా కుసుమంచి రామకృష్ణ, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ ఎస్.ఆనందరావు, గిడుతూరి రాధాకృష్ణ, సీహెచ్ శేఖర్, ప్రఫుల్ల జవహర్, వి.ప్రసాద్ గుప్తా వ్యవమరించారు. చాంబర్ ప్రస్తుత అధ్యక్షుడు రాజ్‌పాల్ ఖురాణ, సాధారణ కార్యదర్శి వి.ప్రభాకర్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

టాటా ఏస్, బైక్ ఢీకొని వ్యక్తికి స్వల్ప గాయాలు



వీలుపర్తి రహదారిలో ఢీకొన్న టాటా ఏస్, బైక్

వేపాడ: మండలంలోని వీలుపర్తి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల మిత్ర గాయాల పాలయ్యాడు. వేపాడ నుంచి వీలుపర్తి వైపు వెళ్తున్న టాటా ఏస్ ఎదురుగా వస్తున్న గోపాలమిత్ర కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న కృష్ణకు గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందడంతో 108 పైలట్ ఎ.ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వేపాడ పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అందజేశారు.

చిన్నారి మృతిపై దర్యాప్తు

గజపతినగరం: అల్లూరి సీతారామ రాజు జిల్లా గురుగుబిల్లి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన రెండు నెలల చిన్నారి మృతి చెందిన విషయంపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల చిన్నారి ఆర్.వర్ష ఆరోగ్యం క్షీణించడంతో వైద్యసేవల కోసం శనివారం సాయంత్రం ఆమె తల్లిదండ్రులు గజపతినగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్ రిఫర్ చేశారు. దీంతో చిన్నారిని గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది సకాలంలో స్పందించక పోవడంతో తమ బిడ్డ మృతి చెందిందని బాధిత తల్లి కృష్ణవేణి ఆరోపించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

135కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి పట్టుబడిన కారు వద్ద పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని దొర్లపాలెం జంక్షన్ వద్ద ఓ కారులో ఉన్న 135 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్విఫ్ట్ డిజైర్ కారును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలేసి పారిపోవడంతో అనుమానం వచ్చి కారు తెరిచి చూడగా 135కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ ఘటనపై ఏఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బంగారయ్య

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామం సమీపంలో ఫ్లెవుడ్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన పూడి బంగారయ్య మామిడిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పోతనాపల్లిలో గ్రామదేవత బండెమ్మతల్లి జాతరకు వచ్చి పసుపు కుంకుమలు సమర్పించి మనుమరాలి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి మామిడిపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎస్.కోట వైపు వస్తున్న క్వారీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనాస్థలిలోనే బంగారయ్య మృతి చెందాడు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16తో చెరకు క్రషింగ్ పూర్తి



మీడియాతో మాట్లాడుతున్న కర్మాగారం అధికారులు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద గల ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఈ నెల 16వ తేదీతో చెరకు క్రషింగ్ నిలుపుదల చేస్తున్నామని కర్మాగారం సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మిగిలి ఉన్న చెరకును రైతులు అనుమతి తీసుకుని గడువులోగా తరలించాలని సూచించారు. చెరకు పర్మిట్‌లు కావాలనుకునే రైతులు తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. సకాలంలో చెరకు గానుగను విజయవంతంగా పూర్తిచేసేందుకు సహకరించిన రైతులు, లారీ, ట్రాక్టర్, మినీట్రాక్టర్, మినీ లారీల డ్రైవర్లతో పాటు ఎడ్ల బండ్ల రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంత వరకూ 4.54 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి కాగా, మరో 23 వేల టన్నుల చెరకు గానుగ ఆడేందుకు లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకూ కర్మాగారానికి చెరకు పంపిన రైతులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిగాయని వెల్లడించారు.

ఆకట్టుకున్న వేషధారణలు

- శాంతమ్మ సంబరాలకు పోటెత్తిన భక్తజనం
- ఘటయాత్రలో రథాలకు ఆహ్వానం



ప్రత్యేక పూజలందుకుంటున్న మాబుడి శాంతమ్మ

బరంపురం: రాష్ట్రప్రభుత్వ అధికారిక ఉత్సవాలు మాబుడి శాంతమ్మ సంబరాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. వారాంతం కావడంతో భక్తులు ఆదివారం తెల్లవారు నుంచే అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఉదయం 5గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు సర్వదర్శనాలకు అవకాశం కల్పించారు. వేలాది మంది బారులు తీరి, శాంతమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ధర్మజెండాకు పంచామృతాలు, పానకాలు సమర్పించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో సంబరాల నిర్వహకులు పాతర్ల దుర్గాప్రసాద్ దేశిబెహరా సతీమణి పాతర్ల రేవతి అమ్మవారి ప్రధాన ఘటంతో బయలుదేరి.. రాజువారి కోట, పెద్ద బజార్ మీదుగా కొనసాగింది. ఇందులో భాగంగా పలు వీధుల్లో సంబరాల వెళ్లనున్న రథాలకు ఆహ్వానం పలికారు. తిరిగి రాత్రి 10గంటలకు స్థానిక దేశిబెహరా వీధిలోని తాత్కాలిక ఆలయానికి చేరుకున్నారు. ఘటయాత్ర సాగుతున్న సమయంలో వేలాదిమంది మహిళలు తరలివచ్చి, శాంతమ్మకు ప్రత్యేక హారతులిచ్చారు. అలాగే చిన్నారులు, పెద్దలు వివిధ వేషధారణలో అమ్మవారిని దర్శించుకొని, భక్తిభావాన్ని చాటుకున్నారు. పోలీసులు, అధికారులు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.



అమ్మవారి ధర్మజెండాకు పానకాలతో చల్లదనం చేస్తున్న మహిళలు



అమ్మవారి భక్తి పాటల సీడీ ఆవిష్కరిస్తున్న గాయకుడు సుదీప్ సాహు బృందం



వేషధారణలో అమ్మవారి దర్శనానికి వెళ్తున్న చిన్నారులు



ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేస్తున్న భక్తులు

ఒడిశా పరివార్ డైరెక్టరేట్‌కు ఆమోదం

- రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో కీలక తీర్మానాలు
- జపాన్ నుంచి వర్చువల్‌గా హాజరైన సీఎం నవీన్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రిమండలితో మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: జపాన్ పర్యటనలో ఉన్న సీఎం నవీన్ పట్నాయక్.. క్యోటో నుంచి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రిమండలితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో ఇదే తొలి డిజిటల్ క్యాబినెట్ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకోగా.. ఏడు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఒడిశా పరివార్ పేరుతో కొత్త డైరెక్టరేట్ ఏర్పాటుకు తీర్మానించడం విశేషం. రాష్ట్రంలో 10 గ్రామీణ తాగునీటి ప్రాజెక్టులకు స్థానం లభించింది. కటక్, కొరాపుట్, నవరంగ్‌పూర్, బొలంగీర్ జిల్లాల్లో కుళాయి నీటి ప్రాజెక్టులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. పీఎఫ్‌ఏ సహాయ నిధుల ప్రతిపాదనను ఆమోదించారు. నాన్-రెసిడెంట్ ఒడియావాసులు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, కార్మిక, విద్యార్థుల సాంస్కృతిక ప్రమోషన్, అనుమతులు తదితర విషయాలకు సంబంధించిన నిర్దిష్ట సమస్యల పరిష్కారం కోసం డైరెక్టరేట్ ప్రభుత్వ విభాగాలతో ఒడిశా పరివార్ పనిచేస్తుంది. అలాగే రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసీయుల విజ్ఞానం, నైపుణ్యాలు ప్రపంచ స్థాయికి చేరువ కావడం ద్వారా వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి కూడా ప్రయత్నాలు చేస్తుంది. అలాగే వివిధ ప్రాంతాల్లోని జగన్నాథ ఆలయాల జాబితాను కూడా సిద్ధం చేస్తుంది. ఒడియా స్ఫూహను ప్రోత్సహించడం, ఉత్కల్ దివాస్ వేడుకలు, ప్రపంచ ఒడియా సదస్సుల నిర్వాహన కోసం ప్రత్యేక పోర్టల్ నిర్వహించనున్నారు.

కార్యకలాపాలు..

- ఒడిశా పరివార్ ప్రవాస ఒడియా ప్రజల కోసం ఏర్పాటైన ప్రత్యేక పోర్టల్.
- ఒడియా భాష, సంస్కృతి, వారసత్వం, పర్యాటకం, క్రీడల ప్రమోషన్‌కు సంబంధించిన విషయాలపై వ్యక్తిగత, సంస్థాగత, పౌరసమాజ స్థాయిలో భాగస్వామ్యాల ద్వారా వివిధ రాష్ట్రాలు, విదేశాలలో నివసిస్తున్న ప్రజలతో సన్నిహిత సంబంధాలు, చేనేత, హస్తకళల అభివృద్ధి పెంపొందించడం.
- ముఖ్యమంత్రి నేతృత్వంలో సలహామండలి ఉంటుంది. మండలి సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది.
- భాష, సాహిత్యం, సంస్కృతి మంత్రిమండలి(ఓఎల్‌ఎల్‌సి)లో శాశ్వత సభ్యుడిగా ఉంటారు. ఈ విభాగం కార్యదర్శి సభ్యుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
- ప్రతిపాదన ప్రకారం, ప్రవాసీ ఒడియా వ్యవహారాల డైరెక్టరేట్ కార్యకలాపాలను సమీక్షించడానికి, వ్యూహాత్మక దిశ నిర్దేశానికి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు అవుతుంది.

సుపరిపాలన.. సాంకేతికత..

ఒడిశా స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్(ఓస్వాన్) అందించిన డిజిటల్ మోడ్‌లో పూర్తిగా సిద్ధం చేసిన నివేదికలు, పత్రాలపై సంతకం చేయడంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పరిపాలన వ్యవస్థల ప్రభావాన్ని మెరుగుపరచడానికి, ప్రజా సేవలు అందించడానికి 5టీ చార్టర్‌లో భాగంగా సరికొత్త సాంకేతికతను ఉపయోగించుకోవడంలో రాష్ట్రం మార్గదర్శకంగా నిలిచింది. సుపరిపాలన, ప్రజా సేవారంగాల్లో సరికొత్త పనితీరుని సాంకేతిక పరిజ్ఞానం జోడిచి, సుదూర జపాన్ నుంచి రాష్ట్ర పాలన వ్యవహారాలను పర్యవేక్షించడంతో ప్రభుత్వ ప్రజా పాలనలో సరికొత్త శకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సాంకేతికత నైపుణ్యత పర్యటనలో సుపరిపాలనకు అనుకూలత కల్పించిందని, ప్రభుత్వ పాలనలో భౌతిక ఉనికి పరిమితులను అధిగమించిందని పేర్కొన్నారు. సహకార వాతావరణంలో ఈ డిజిటల్ క్యాబినెట్ సాంకేతికత, పాలన వేగంలో అడ్డంకులను తొలగించిందన్నారు. ఓస్వాన్ రాష్ట్రానికి కీలకమైన సమాచార, సాంకేతిక వెన్నెముకగ అభివర్ధించారు. వినూత్న సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ అధికారులను పత్రాలపై సహకరించడానికి, అభిప్రాయాన్ని పంచుకోవడానికి, సమయానుకూల మార్పులను పర్యవేక్షించేందుకు వారధిగా నిలుస్తుందన్నారు. తద్వారా ప్రాజెక్ట్‌లు, కార్యక్రమాలపై కలిసి పని చేయడం సులభం అవుతుందని సగర్వంగా ప్రకటించారు.

వైభవం.. వార్షిక బ్రహ్మోత్సవం



చక్రస్నానానికి ఉత్సవ మూర్తులను తరలిస్తున్న భక్తులు



బ్రహ్మోత్సవం ప్రాంగణంలో మహిళల వసంతోత్సవ సందడి



భక్తుల తాకిడితో కళకళలాడిన బాలాజీ కల్యాణోత్సవం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ లోని అకౌంట్స్ కాలనీ కొండపై ఉన్న బాలాజీ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల ఆద్యంతాలు ప్రధానార్చకులు రంగాభట్ల ధనుంజయాచార్యులు ఆధ్యాత్మిక, ధార్మిక విశిష్టతలో ఇమిడిన లోక కల్యాణం ప్రాముఖ్యతను వ్యాఖ్యానించి పూజలు నిర్వహించారు. విశాఖపట్నం, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలి వచ్చారు. తిరుమలలో జరిగే వేంకటేశుని కల్యాణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వంటి ప్రత్యేక ఉత్సవాలను స్థానిక దేవస్థానంలో కనులారా తిలకించిన అనుభూతి మిగిల్చిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కనుల పండువగా జరిగిన బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం వసంతోత్సవం, చక్రస్నానం, పుష్పయాగం నిర్వహించారు. వసంతోత్సవ వేడుకలో భక్తులు అత్యంత ఆనందోత్సాహాలతో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఉత్సవ వేదిక నుంచి దేవస్థానం ప్రాంగణం తాత్కాలిక పుష్కరిణి వరకు బాజా భజంత్రీలతో సుదర్శన సహిత శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉత్సవ మూర్తులను తరలించారు. తెలుగు సౌరభం, లలితా మండలి ఇతరేతర స్థానిక వర్గాలు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, కోలాటం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. దేవస్థానం బహుముఖ అభివృద్ధిలో స్థానికుల భక్తిశ్రద్ధలతో కూడిన శ్రమదానం అనన్యంగా వీరంతా కొనియాడారు. అలాగే గరుడ, హనుమ, శేష వాహన సేవల్లో స్వామివారు పట్టణ వీధుల్లో ఊరేగితూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మంగళ హారతులతో దేవదేవుని స్వాగతించారు. వాద్య బృందం ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.

కొట్లాటలో గాయపడిన వ్యక్తి మృతి

- న్యాయం కోసం గ్రామస్తుల భైఠాయింపు
- పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

పాలకొండ రూరల్: ఇద్దరి యువకుల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయగా ఈ ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితులు, ఆప్రాంత వాసులు, పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ నగరపంచాయతీ పరిధి 3వ వార్డు ఎస్‌కె.రాజపురం ప్రాంతానికి చెందిన యువకులు ముడిదాన మోహనరావు, చందక శివశంకర్ శుక్రవారం రాత్రి తమ నివాసాలకు సమీపంలో గల చెరువు వద్ద చేరుకున్నారు. అక్కడ వారి మధ్య వాగ్వాదం జరిగింది. కొంత సమయం తరువాత మోహన్‌రావు ఇంటికి శివశంకర్ చేరుకుని గొడవపడ్డాడు. ఈ క్రమంలో మరోసారి వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఆ సమయంలో అడ్డుపడిన మోహన్‌రావు తండ్రి చంద్రరావు(52) శివశంకర్ చేసిన దాడిలో తీవ్రగాయాలపాలయ్యాడు. ఆయనను తొలుత పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఆయన పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఈఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు.



శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మరణించిన చంద్రరావు

కేసును పక్కదోవ పట్టిస్తున్నారన్న ప్రచారం ఊపందుకోవడంతో బాధిత కుటుంబీకులు, 3వ వార్డు ప్రజలు ఒక్కటై న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. చంద్రరావు మరణానికి కారణమైనవారిపై కేసు నమోదు చేయాలని, బాధ్యులను అదుపులోకి తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నినదిస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని భైఠాయించారు.



పోలీస్ స్టేషన్ వద్ద భైఠాయించిన గ్రామస్తులు, బాధిత కుటుంబీకులు

పాలకొండ- శ్రీకాకుళం రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్‌కే రాజపురం గ్రామస్తులు భైఠాయించడంతో పాలకొండ- శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు స్టేషన్‌కు వచ్చి బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధ్యుడిని అదుపులోకి తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని ఎస్సై బి.శివప్రసాద్‌కు, తక్షణమే దర్యాప్తు జరపాలని సీఐ మురళీధర్‌కు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో బాధితులు, గ్రామస్తులు శాంతించి వెనుదిరిగారు.

గ్రామదేవత సంబరాలు ప్రారంభం



మామిడిపల్లిలో నైవేద్యం తీసుకువెళ్తున్న భక్తులు

సాలూరు: మండలంలో మామిడిపల్లి గ్రామదేవత పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వచ్చే నెల పండుగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం గల్లకలిపారు. ముంగారవ్మ, దేశమ్మ, వల్లమ్మ, కొత్తమ్మ, గజేంద్రుడులకు గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఊరు కట్టారు. నైవేద్యాన్ని అమ్మవార్లకు భక్తులు సమర్పించారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

గిరిజనుల తరఫున పోరాటం

- న్యాయవాది రేగు మహేశ్వరరావు



మాట్లాడుతున్న రేగు మహేశ్వరరావు

సాలూరు: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, గిరిజనుల తరఫున పోరాటం చేస్తామని గిరిజన ఉద్యోగుల న్యాయసలహాదారు, న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలో సానిక విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం టీడీపీ ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో నాడు తీర్మానించిందని గుర్తుచేశారు. రాజకీయపార్టీలు రాజకీయాల కోసం గిరిజనులకు అన్యాయం చేయడానికి చూస్తున్నాయని ఆరోపించారు. గతంలో చంద్రబాబు చేసిన తీర్మానం తప్పని టీడీపీలోని గిరిజన నాయకులు ఖండించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో బోయ వాల్మీకులను చంద్రబాబు, లోకేష్‌లు రెచ్చగొడుతున్నారని, మరోవైపు ఇక్కడ ఏడు నియోజకవర్గాల్లో గిరిజనులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గిరిజనులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. గిరిజనులకు అండగా నిలబడాలని రాష్ట్రపతి, కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టప్రకారం గిరిజనుల హక్కులను కాపాడడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. పలువురు గిరిజనేతరులు తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులుగా ఉద్యోగాలు, ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు.వారిపైనా న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మా వద్ద ఉన్న ఆధారాలను ప్రజలకు చూపిస్తామన్నారు.దీనిపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపిక

టెక్కలి: చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్కలి మండలం దామోదరపురంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరానికి చెందిన చంద్రమౌళి ప్రథమ, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కుప్పిలి సాయి వెంకట్ ద్వితీయ, మందసకు చెందిన లోకేష్ తృతీయ, బద్రి గ్రామానికి చెందిన అభినవ్ నాలుగో స్థానం సాధించారు. వీరికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు గణపతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 29 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు వెల్లడించారు.

సీపీఎస్ రద్దుపై నిర్ణయం ప్రకటించాలి

శ్రీకాకుళం: సీపీఎస్ రద్దు అంశంపై రాష్ట్ర రాజకీయ పార్టీలు నిర్ణయాన్ని ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ చేశారు. శ్రీకాకుళంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో సీపీఎస్ విధానం తీసుకువచ్చినప్పుడు వామపక్షాలు తప్ప మిగిలిన వారందరూ అనుకూలంగా ఓటువేశారన్నారు. సీపీఎస్ వద్దు అని 2004 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేస్తున్నాయనిచెప్పారు. పాత పింఛన్ విధానంలోనికి వెళితే ఎన్ఎస్‌డీఎల్ డబ్బులు తిరిగి రావని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో సత్యసాయి సంస్థల ముందంజ



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు

టెక్కలి: జిల్లాలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. ఆదివారం టెక్కలి రోటరీనగర్‌లో సత్యసాయి శాంతి సుధా మందిరంలో జోనల్ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ వైపు ఆధ్యాత్మిక, మరోవైపు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సత్యసాయి సేవా సమితి స్వచ్ఛంద సేవలు జిల్లాలో ముందంజలో నిలిచాయన్నారు. చిన్నారులకు బాల వికాస్ ద్వారా నైతిక విలువలో బోధిస్తున్నామన్నారు. సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా ద్వారా ఎంతో మంది అభాగ్యులకు అన్నదానం చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు రామచంద్రరావు, అనాధ గుప్తా, మల్లేశ్వరరావు, చంద్రమౌళి, సుధారాణి, లలిత, అన్నపూర్ణమ్మ, అమ్మాయమ్మ, నాగమణి, వెంకటలక్ష్మి, చంటి, నారాయణ మూర్తి, జగదీశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ అనుమానాస్పద మృతి

మందస: మండలంలోని హరిపురంలో ఓ కార్పెంటర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన సింహాద్రి లోకేష్(38) వృత్తిరీత్యా కర్రపని చేస్తున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. కొద్దిరోజులుగా హరిపురంలో కార్పెంటర్ పని చేస్తున్నాడు. ఆదివారం బస్టాండ్ వద్ద శరీరంపై గాయాలతో అచేతనంగా పడి ఉండటంతో స్థానికులు హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా ఆసుపత్రి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ లోకేష్ ఆదివారం మరణించాడు. వడదెబ్బ వల్ల గానీ, అధిక మద్యం సేవించడం వల్ల గానీ మరణించి ఉంటాడని భావిస్తున్నారు. లోకేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది వరకూ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్‌కు ఎంపిక చేస్తామని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ వెల్లడించారు. ప్రాబబుల్స్ జాబితాను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ ఎంపికలకు చీఫ్ సెలెక్టర్‌గా కిల్లి సుదర్శన్ వ్యవహరించగా సెలెక్టర్లుగా ఆర్‌సీ రెడ్డి, మదీనా సైలాన్, వర్ధన్‌లు వ్యవహరించారు.

పట్టుదలకు ప్రతిరూపం



జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలో ఆడుతున్న రూపాదేవి

- కాళ్లు లేకున్నా కలలు సాకారం చేసుకుంటున్న సిక్కోలు యువతి
- పారా బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో విజయ కేతనం
- జాతీయస్థాయిలో రాణిస్తున్న రూపాదేవి

జి.సిగడాం: ఆమెకు కాళ్లు పనిచేయవు. కానీ కలలు కనగలదు. అడుగు వేసే పరిస్థితి లేదు. అయితేనేం బతుకులో ముందడుగు వేయగలదు. అన్ని దిక్కులా అవరోధాలు అడ్డుగా ఉన్న చోట ఆ గోడలు దాటుకుని విజయ తీరాలు వెతికింది పడాల రూపాదేవి. పారా బ్యాడ్మింటన్ లీగ్‌లో ఒక్కో స్థాయిని దాటుకుంటూ ఏకంగా జాతీయ స్థాయిలో జెండా ఎగరేసింది. జి.సిగడాం మండలంలోని పడాల యశోద, సత్యనారాయణ రెండో కుమార్తె రూపాదేవి. చిన్నప్పుడే ఆమె తన తండ్రిని కోల్పోయింది.



ఈ వృద్ధుల సహకారంతోనే జాతీయ స్థాయికి చేరిన రూపాదేవి

అప్పటి నుంచి తల్లి యశోద తన రెక్కల కష్టంతో సంతానాన్ని పెంచి పెద్ద చేసింది. సంతవురిటి జెడ్పీ హైస్కూల్‌లో 2015–16లో టెన్త్ పాసైంది. చక్కటి మార్కులు సాధించి ప్రభుత్వం చేత ప్రశంసలు కూడా అందుకుంది, 2019లో డిగ్రీ చదువుతుండగా డాబా మీద నుంచి పడిపోయి రెండు కాళ్లు పోగొట్టుకుంది.

దేశం తరఫున ఆడుతా..



నాకు దేశం తరఫున ఆడాలని ఉంది. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నాను. ఇప్పటికే మైసూర్‌లో శిక్షణ తీసుకున్నాను. పోటీలకు వెళ్లాలంటే ఒక ఆటకు సుమారుగా రూ.3లక్షలు ఖర్చవుతాయి. దాతలు సహకరిస్తే నాకు మేలు జరుగుతుంది.

– పడాల రూపాదేవి, జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

రాష్ట్రానికే గర్వకారణం..



పడాల రూపాదేవి మా గ్రామంతో పాటు రాష్ట్రానికి కూడా గర్వకారణం. ఆమెకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తాం. అధికారులు, నాయకులు ద్వారా సీఎం దృష్టికి తీసుకువెళ్లి అంతర్జాతీయ స్థాయిలో ఆటలు ఆడేలా కృషి చేస్తాం. – బుడారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి

మరింత వేగంగా..

అంత పెద్ద ప్రమాదం జరిగాక బతుకులో వేగం తగ్గిపోతుంది. కానీ రూపాదేవి అందరి కంటే భిన్నంగా వ్యవహరించింది. రెండు కాళ్లు లేకపోయినా అంతులేని ఆత్మవిశ్వాసంతో పారా బ్యాడ్మింటన్ పోటీలు ఆడడం ప్రారంభించింది. 2021 డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. దీంతో కొందరు దాతలు ఆమె శిక్షణకు సాయం చేశారు. మైసూరులో తర్ఫీదు తీసుకున్న ఆమె 2022 ఆగస్టులో బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలను సాధించింది.

నిరుపేద నేపథ్యం: రూపాదేవిది చాలా సామాన్యమైన కుటుంబం. అందులోనూ దివ్యాంగత్వం. ఇలాంటి పరిస్థితుల్లో ఆటల వైపు దృష్టి సారించడం దాదాపు అసాధ్యం. కానీ రూపాదేవి ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది. గత నెల 23, 26వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించిన 5వ జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ఒక బంగారు పతకం, రెండు వెండి పతకాలను సాధించింది.

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త..!

- రోజురోజుకు పెరుగుతున్న ఎండలు
- చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్

పాలకొండ రూరల్: వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఎండల దాటికి ప్రజలు అల్లాడుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు చిన్నపిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉన్నా..బయటకు వెళ్లినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఆరోగ్యపరమైన ఇబ్బందుల బారినపడే అవకాశం ఉందని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యనిపుణుడు జె.రవీంద్రకుమార్ సూచిస్తున్నారు.

చిన్నారుల విషయంలో..

- చంటిపిల్లల్లో శరీరంలో ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచేందుకు అధిక మోతాదులో తల్లిపాలు పట్టాలి.
- చిన్నారుల శరీర ఉష్ణోగ్రత పెరిగితే పచ్చకామెర్లు (జాండిస్) సోకే ప్రమాదం ఉంటుంది.
- మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు దాహం తీరేవరకు(తరచూ) నీటిని అందిస్తూ ఉండాలి.
- వేడి గాలుల నుంచి రక్షణ కోసం పలుచని కాటన్ దుస్తులు ధరించాలి. ఈ దుస్తులు ఎప్పటికప్పుడు తడిపి వాడటం మంచిది.
- మూత్రం క్రమంగా రాకపోవడం, నోరు తడి ఆరిపోవడం, చర్మం పొడిబారడం, వాంతులు, విరేచనాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- శరీరానికి చల్లదనం చేకూర్చే కొబ్బరి, బార్లి నీళ్ల వంటివి ఇవ్వడం శ్రేయస్కరం.
- మూడేళ్ల పైబడిన పిల్లల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో వీరికి మూత్రపిండాల సంబంధిత సమస్యలు అధికంగా వస్తుంటాయి.
- విపరీతమైన జ్వరం, మూత్ర విసర్జన సరిగా లేకపోవడం, నీరసంగా ఉండడం, నాలుక తడి ఆరిపోవడం జరుగుతుంటుంది. ఈ సమయంలో అధిక శాతం నీటిని అందించాలి.
- పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధులు శరీరంలో ఉష్ణోగ్రతల సమతుల్యతను కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు తీసుకోవాలి.

ఆహారపు అలవాట్లు..

ఎండను తట్టుకునేందుకు శీతల పానీయాలు, జ్యూస్‌లు వంటివి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదికాదు. వాటిని సేవించటం వలన శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. అంతేకాకుండా రక్తంలో పాస్పరస్ అధికంగా చేరుతుంది. దీనివల్ల ఎముకలు, దంతాలు, కిడ్నీ సంబంధింత ఇబ్బందులు వస్తాయి. కావున వీటిని సాధ్యమైనంత వరకు తీసుకోకపోవడం మంచిది. ఎక్కువగా నీరు తాగాలి. శరీర ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించేందుకు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ముఖ్యంగా పాలకూర, ముల్లంగి, వెల్లుల్లి, నీరుల్లి, బీట్‌రూట్ తదితర ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే వివిధ రకాల పండ్లు తీసుకోవడం ఉత్తమం. శరీరం నుంచి చెమట రూపంలో కోల్పోయిన లవణాలను తిరిగి పొందేందుకు మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్రీడా సందడి



ఓ స్పోర్ట్స్ షాపులో అందుబాటులో క్రీడాసామాగ్రీ



వాలీబాల్ గేమ్ సాధనలో క్రీడాకారులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న డంబెల్స్

- వివిధ టోర్నీలతో మైదానాలు కళకళ
- స్పోర్ట్స్ షాపుల్లో పెరిగిన క్రీడా సామగ్రి విక్రయాలు
- పరీక్షలు ముగుస్తుండటంతో మైదానం బాట పడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇప్పటికే ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. మరో వారం రోజుల్లో పది పరీక్షలు సైతం ముగియనున్నాయి. పిల్లలకు ఒంటిపూట బడులు మొదలయ్యాయి. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన చిన్నారులు, విద్యార్థులు మైదానబాట పట్టేందుకు ఉవ్విల్లూరుతున్నారు. ఓవైపు టోర్నమెంట్లు, లీగ్ మ్యాచ్‌ల నిర్వహణతో మైదానాలు కళకళలాడుతున్నాయి. మరోవైపు స్పోర్ట్స్ షాపుల్లో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి.

వేసవి శిబిరాలకు సన్నద్ధం..

జిల్లా కేంద్రంతో పాటు గార, కళింగపట్నం, సింగుపురం, ఇచ్ఛాపురం, సోంపేట, మకరాంపురం, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, నరసన్నపేట ఆమదాలవలస, ఎచ్చెర్ల, రణస్థలం తదితర ప్రాంతాల్లోని మైదానాల్లో క్రీడాకారులు, చిన్నారులు సందడి చేస్తున్నారు. వివిధ క్రీడాంశాల్లో నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకునేందుకు రెడీ అయిపోతున్నారు. త్వరలో మొదలయ్యే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సన్నద్ధమౌతున్నారు. మరికొంతమంది త్రివిధ దళాల్లో ఉద్యోగాలకు శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడంలో నిమగ్నమవుతున్నారు.

టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లతో హడావిడి..

వేసవి సెలవుల్లో భాగంగా మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి, అంతర్రాష్ట్ర క్రీడా టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు యువత ఇప్పటికే ప్రణాళిక వేస్తున్నారు. కొన్నిచోట్ల టోర్నమెంట్లు మొదలుపెట్టేశారు. ముఖ్యంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రీడాంశాల్లో టోర్నీలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటితోపాటు ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, కరాటే, తైక్వాండో, జూడో క్రీడాంశాల్లోను పోటీలకు కసరత్తులు చేసుకుంటున్నారు.

స్పోర్ట్స్ షాపుల్లో విక్రయాల జోరు..

ఒకప్పుడు స్పోర్ట్స్ మెటీరియల్స్ కోసం విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. జిల్లా కేంద్రంలో విస్తారంగా స్పోర్ట్స్ దుకాణాలు వెలిశాయి. క్రీడా దుస్తుల విక్రయాలతోపాటు క్రికెట్ కిట్లు (బాల్స్, బ్యాట్స్, ప్యాడ్స్, గ్లోవ్స్), వాలీబాల్, షటిల్ రాకెట్స్ మొదలుకుని క్రీడా సామగ్రి విక్రయాలతో షాపుల్లో సందడి వాతావరణం నెలకొంది. ఫిట్‌నెస్ మెరుగు పరికరాలు, బండెల్స్ విక్రయాలు జోరందుకున్నాయి. టోర్నీల్లో విజేతలకు, క్రీడాకారులకు బహుమతులుగా అందజేసే ట్రోఫీలు, షీల్డ్స్, మెమెంటోలు, పతకాల విక్రయాలు కూడా పెరిగాయి. మరికొంతమంది ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భానుని ప్రతాపం ఎక్కువగా ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచే సర్వ దర్శనాలకు అవకాశమివ్వడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో తొలి దర్శనం చేసుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఎండ ప్రభావం లేకుండా టెంట్లు వేయించారు. ఆలయం ముందు ఇటీవల కాలంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ షెడ్లు ఉపయోగపడ్డాయని భక్తులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,51,300, పూజలు, విరాళాల ద్వారా రూ.69,899, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలియజేశారు.

బహిరంగ సభకు స్థల పరిశీలన



పోర్ట్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సంతబొమ్మాళి: మూలపేట(భావనపాడు) గ్రీన్‌ఫీల్డ్ పోర్టు శంకుస్థాపన కోసం అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మూలపేటలో శంకుస్థాపనకు అనువైన ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదివారం పరిశీలించారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలంపై ఆరా తీశారు. పాలనాయుడు పేట నుంచి మూలపేట వరకు ఇరుకు రోడ్డు ప్రయాణం చేయాల్సి వస్తుంది. రెండు ఇరుకైన ఉప్పునీటి వంతెనలు దాటాల్సి ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉండటం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే మరో చోట అనువైన స్థలం పరిశీలించాలని ఆదేశించారు. కాకరాపల్లి పవర్ ప్లాంట్, నౌపడ పరిసర ప్రాంతాల్లో సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పరిశీలించామని అధికారులు జేసి దృష్టికి తీసుకు వచ్చారు. ఆయనతో పాటు తహసీల్దార్ చలమయ్య, టెక్కలి సీఐ చంద్రమౌళి, సర్వేయర్ బాలరెడ్డి, ఆర్ఐ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్, వీఆర్వో ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కల్యాణం..కమనీయం!



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో కలెక్టర బంగ్లా ఎదురుగా ఉన్న నాగావళి నదీతరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక తిరుక్కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్లకూర్మానదాసు పర్యవేక్షణలో అర్చకులు బూరాడ వంశీకృష్ణ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి మల్లె, బంతి వంటి పూలతో మండపాన్ని అలంకరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• వైభవంగా తిరువీధి



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న 516 మంది మహిళల

శ్రీకాకుళం నగరంలోని పున్యపు వీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్స లాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. డే అండ్ నైట్ కూడలి నుంచి బయలుదేరి ఇలిసిపురం, రైతుబజారు మీదుగా పున్యపు వీధి వరకు తిరువీధి సాగింది. 516 మంది మహిళలు కలశాలతో శ్రీరామనామ జపంతో పాల్గొనగా.. తప్పెటగుళ్లు, కోలాటం, హరేరామ భజన బృందాలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అరసవల్లి ఆలయ అర్చకులు హరిబాబు, ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



వేషధారణలో కళాకారులు



ఆకట్టుకున్న కళాకారుల విన్యాసం